# పెళ్లిబేర

యస్. నాగేంద్ర ప్రసాద్



'ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం, మధురగీతాలు కార్యక్రమంలో ముందుగా 'గుండమ్మ కథ' చిత్రం నుంచి అమరగాయకుడు ఘంటసాల పాడిన పాట. సంగీతం ఘంటసాల, రచన... ఎనౌన్సరు గొంతు శ్రావ్యంగా వినిపించింది.

'మౌనముగా నీ మనసు పాడిన వేణుగానము వింటిలే...' ఘంటసాల పాట ప్రారంభమైంది. పాట వింటున్న లత మనస్సంతా ఎంతో చిరాగ్గా ఉండడంతో, అంత మంచి పాటను ఎంజాయ్ చేయలేకపోతోంది. ఏదో తెలియని అశాంతి. ఒకప్పుడు పాతపాటలంటే చెవికోసుకోనేది. అలాంటిది ఎందుకనో ఈ రోజు అసలు పాటలే వినాలనిపించకపోవడంతో విసుగ్గా రేడియోని ఆఫ్ చేసింది.

పాటనంటే ఆపిందికాని, ఆమె మససులోని ఆలోచనలను మాత్రం ఆపలేకపోయింది. ఆమెకు వారంరోజుల క్రితం భర్త శ్రీధర్‌తో జరిగిన సంభాషణలు పదేపదే గుర్తుకువస్తున్నాయి.

'ఏవండి, నాన్నగారు ఫోను చేసారండి. వసుధకి ఏదో సంబంధం చూసామని చెప్పారు కదా. వాళ్లు అమ్మాయి నచ్చిందని చెప్పడంతో, అర్జెంటుగా పెళ్లికి ముహుర్తాలు కూడా పెట్టేశారట. మనల్ని వీలు చూసుకొని కొంచెం ముందుగానే పెళ్లికి రమ్మన్నారు' ఎంతో అనందంగా ఆ శుభవార్తని మార్నింగ్‌వాక్ నుంచి వచ్చిన శ్రీధర్‌కి చెప్పింది లత.

'అలాగా... చాలా సంతోషం... ఇంతకీ

అబ్బాయి ఏం చేస్తున్నాడట', ఏమీ తెలియని వాడిలా అడిగాడు శ్రీధర్.

'పెళ్లికొడుకు బ్యాంక్‌లో పనిజేస్తున్నాడు, ఏం మర్చిపోయారా?' గుర్తుచేస్తూ అంది లత.

'ఔనౌను, అయితే కట్నం దండీగానే ఇస్తుం డాలే' నవ్వుతూ అన్నాడు శ్రీదర్.

'ఇవ్వక తప్పుతుందా. బ్యాంక్ ఉద్యోగం అంటే మాటలా... కనీసం రెండు లకారాలకి తక్కువకి రారు. అయినా అందరూ మీలా కట్నం తీసుకోకుండా ఆదర్శంగా ఉంటారా ఏమిటీ?' అతనివంక మెచ్చుకోలుగా చూస్తూ అంది.

'ఏమో లతా... మనయింటికి వచ్చే అమ్మా యి ఆనందంగా రావాలిగాని, కట్నకానుకలతో కాదు. ఉన్నంతలోనే తింటాం. అదీ నా పాలసీ,' ఎంతో హుందాగా చెప్పాడు.

'నిజమేనండి, అప్పట్లో మీరు కట్నం తీసు కోను అంటే అందరూ నానా రకాలుగా మాట్లా డారు. అబ్బాయి కట్నం వద్దు అన్నాడంటే అబ్బా యిలో ఏమైనా లోపముందేమో, ముందే కను క్కుంటే మంచిదని నాన్నగారితో అన్నవాళ్లు కూడా ఉన్నారు. వాళ్లు అలా మాట్లాడినపుడు అమ్మా నాన్నలు కూడా మీ సంబంధం విష యంలో మరొక్కసారి ఆలోచిస్తే బాగుందునేమో అనుకొన్నారు' అతనికి తెలియని విషయాన్ని చెప్పింది లత.

'వాళ్లు అలా అనుకొన్నారు సరే, మరి నా గురించి నువ్వేమనుకొన్నావు' కొంటెగా అడి గాడు శ్రీధర్.

'మీ ఆదర్శం గురించి విని మీరు ఎంతో మంచి వారని ఆనాడే అనుకొన్నాను. కాని ఎంతైనా తల్లిచాటు బిడ్డని కదా, నాకంటూ



ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకోలేదు. అమ్మా నాన్నలు ఎంత చెబితే అంత. అదీకాక పెళ్లిళ్లు స్వర్గాలలోనే జరుగుతాయంటారు. ఎవరికెవరో ఆ భగవంతుడు ముందరే రాసి పెడతాడట కదా. నా అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది. విధిని, తలరాతనీ తప్పించడం ఒకరి తరమా అని మిమ్మల్ని పెళ్లిచేసుకోవడానికి ఇష్టపడ్డాను. పైగా మానాన్నగారి పరిస్థితికి మీలాంటి సంబంధం రావడమే ఎంతో గొప్ప. అందుకని మీ సంబంధానికి మావాళ్లు మారుమాట్లాడకుండా వప్పుకొన్నారు' చెప్పింది లత.

'అంతేకాని, నా అందం చూసి, నా ఉద్యోగం చూసి కాదన్నమాట' ఉడుక్కొన్నాడు శ్రీధర్.

'ఏమండీ, మా చెల్లి పెళ్లికి మనం ముందుగానే వెళ్దామండి,' గోముగా అడిగింది లత.

'దానిదేముందోయ్, తప్పకుండా వెళ్దాం. అయితే నాకు ఆఫీసులో పనులున్నాయి, అందుచేత నువ్వు ఒక వారంరోజులు ముందుగా వెళ్లు, పెళ్లికి రెండురోజులు ముందుగా నేనొస్తాను' చెప్పాడు శ్రీధర్.

'మీరు ఆ యింటి పెద్దల్లుడండి, మీరు ముందుగా రాకపోతే ఎలాగా? అందరూ ఏమనుకొంటారు. అయినా అమ్మానాన్నలకు మనం తప్పించి ఎవరున్నారు. కాస్త ముందుగా వెళ్తే ఆ పెళ్లిపనులు అవీ చూడొచ్చును. అన్ని పనులూ నాన్నగారు ఒక్కరే ఎలా చూసుకోగలరు' అడిగింది లత.

'బావుంది లతా... ఇవేమైనా పూర్వకాలపు పెళ్లిళ్లా? పెళ్లి అనగానే తెగ హైరానా పడిపోవడానికి. ఈ రోజుల్లో పెళ్లి పనులంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవు. అన్నీ 'కాంట్రాక్టు' పెళ్లిళ్లే కదా! చేతిలో డబ్బుంటే చాలు, ఈ రోజు అనుకొని రేపు పెళ్లి చేసెయ్యొచ్చును' భుజాలెగరేస్తూ చెప్పాడు శ్రీధర్.

'మీరు ఏమైనా చెప్పండి, నాన్నకి సాయంగా ఉంటే మంచిదని నా అభిప్రాయం. అదీకాక మనం ఉంటే వాళ్లకి ధైర్యంగా కూడా ఉంటుంది' ఆమె తన మనసులోని అభిప్రాయాన్ని చెప్పింది.

సరే లతా... పెళ్లికి ముందుగా రావడానికి ప్రయత్నిస్తాను. నాకు ఆఫీసుకు టైమవుతోంది, టిఫిన్ రడీ చేసావా? స్నానానకి వెళ్లబోతూ అన్నాడు శ్రీధర్.

'అన్నీ సిద్ధమే, ముందు మీరు వెళ్లి స్నానం చేసి రండి' వంటింటిలోకి వెళ్తూ అంది లత.

వేడివేడి ఇడ్లీలలో కారప్పొడి, నెయ్యి వేసుకొని వాటి రుచిని ఆస్వాదిస్తున్న శ్రీధర్‌తో, 'ఏమండీ... మా చెల్లెలు పెళ్లికి నేను ఓ పట్టుచీర కొనుక్కుంటానండి', గ్లాసులో మంచినీళ్లు పోస్తూ అంది లత.

'తప్పకుండా కొనుక్కో, అయితే ఏమాత్రంలో కొనుక్కోవాలనుకొంటున్నావు?' చట్నీ వేసుకొంటూ అడిగాడు శ్రీధర్.

'ఆ... ఏముంది ఓ ఐదారువేలల్లో' ఎంతో తేలిగ్గా చెప్పింది లత.

'ఐదారు వేలా...?' లతా అంత ఖరీదులో కాకపోతే, కొంచెం తక్కువలో కొనుక్కోవచ్చుగా?

'బావుందండి... ఐదారు వేలల్లోనే ఓ మాదిరి చీర వస్తుంది. అంతకన్నా తక్కువదైతే అసలు ఏమీ బాగోదండి'

'చూడు లతా, అంత డబ్బుపెట్టి ఓ 'పట్టు చీర' కొనుక్కునే కన్నా, అదే డబ్బులతో ఓ

రెండు, మూడు మంచి చీరలు కొనుక్కో వచ్చుగదా?' తన అభిప్రాయాన్ని తెలిపాడు శ్రీధర్.

'మీరు ఎన్నైనా చెప్పండి. ఈసారి మాత్రం పట్టుచీర కొనకపోతే ఊరుకోను' ఖచ్చితంగా చెప్పింది లత.

'అదిగాదు లతా. ఇప్పటికే నీ బీరువాలో చాలా పట్టుచీరలున్నాయి. పోనీ అవి కట్టుకో వచ్చుగా' అడిగాడు శ్రీధర్.

'దాంట్లో మీరంటూ కొన్నవి ఏమీ లేవు. అవన్నీ మావాళ్లు కొన్నవి. అయినా అందులో ప్రతీదీ నేను ఇదివరకు కట్టేసినవే' దెప్పిపొడుపుగా అంది లత.

'అంటే నేను కొంటేనేగాని చీర కట్టుకోవన్న మాట' కొంచెం కోపంగా అన్నాడు.

'మీకు పట్టుచీర కొనడం ఇష్టం లేదని చెప్పండి. నేను మిమ్మల్ని ఇంకెప్పుడూ జన్మలో మరో చీర కొనమని అడగను' అతణ్ణి రెచ్చగొట్టే లాగా తిరిగి అంది లత.

'లతా... నేను నా ఇష్టం గురించి మాట్లాడ లేదు. ఇప్పుడు అంత ఖరీదు పెట్టి పట్టుచీర కొనడం అవసరమా అన్నాను అంతే' సంజాయిషీగా అన్నాడు శ్రీధర్.

'కొన్ని వస్తువులు అవసరం లేకపోయినా, ఆడంబరం కోసం, మన స్టేటస్ కోసం కొంటామండి. అయినా ప్రతీదానికీ మీరు ఇలా మాట్లాడడం నాకు ఏమీ నచ్చలేదు' ఆవేశంగా అంది లత.

'లతా... నువ్వు నన్ను అర్థం చేసుకొన్నది ఇంతేనా? ఆఫ్ట్రాల్ ఒక పట్టుచీరకోసం, కట్టుకొన్న భర్తనన్న గౌరవం కూడా లేకుండా మాట్లాడుతున్నావు. ఇది నీకు భావ్యం కాదు' బాధగా అన్నాడు.

'చూడండి మీరు 'కట్టుకొన్న భర్త' లాంటి భారీ డైలాగులు అనవలసిన అవసరం లేదు. భార్య కోరికలు తీర్చలేనివారు భర్త అనిపించుకోదండి' ఇంకా వ్యంగ్యంగా మాట్లాడింది.

శ్రీధర్ ఆమె ప్రవర్తనకి విస్తుబోయాడు. అతని అహం దెబ్బతింది. 'చూడు లతా... నేను మళ్లీ మళ్లీ చెప్పను. నా మాటవిని ఆ పట్టుచీర బదులు మరేదైనా కొనుక్కో. ఎందుకంటే ఆ పట్టుచీర పెళ్లిలో మహా అయితే ఒక్కసారి కట్టుకొంటావు. తీరా కట్టుకున్న తరువాత ఆ ఉక్కబోతలో ఎంత తొందరగా విప్పేద్దామా అనిపిస్తుంది. మళ్లా వేరే ఫంక్షన్ వచ్చేవరకు ఆ చీర బీరువాలో మురుగుతుంది. తీరా వేరే ఫంక్షన్‌లో అదే చీర కడతావా అంటే, అబ్బా! యిది క్రిందటిసారి ఫలావా వారి పెళ్లిలో కట్టేసాను అంటూ వేరే చీర కడతావు గాని ఆ చీర మాత్రం కట్టవు. అంతమాత్రం దానికి అంతంత ఖరీదులు పెట్టి కొనడం ఎందుకు? బీరువాలో మూలగబెట్టడానికా?' కోపాన్ని తమాయించుకొని మరొక్క సారి ఆమెకి నచ్చచెప్పబోయాడు.

'అయ్యా! మహానుభావా, మీరేమీ కొనక్కర్లేదు. ఆ డబ్బులు ఏవో మీరే ఉంచుకోండి. ఆమాత్రం చీర మా పుట్టింటివాళ్లు కొనలేక పోరు. ఇంక మీరు ఈ చీరేకాదు, ఏ చీర కొన్నా కట్టుకొనేది లేదు' అంటూ నిష్ఠూరంగా అంది.

'నీ యిష్టం వచ్చినట్టు చేసుకో నాకేం సంబంధం లేదు' అంటూ తింటున్న టిఫిన్‌ని మధ్యలో వదిలేసి కోపంగా ఆఫీసుకు వెళ్లిపోతున్న శ్రీధర్‌తో,

'మీకేనా అంత పౌరుషం? నాకు మాత్రం లేదనుకొన్నారా? నేను ఇప్పుడే మా పుట్టింటికి

వెళ్లి పోతున్నాను. ఇంక మీరు ఎంత బ్రతిమా లినా తిరిగి రాను' అంటూ ఉక్రోషంగా చెప్పింది లత.

'నేనేం నీ వెనకపడి బ్రతిమాలతాననుకోకు' అంటూ విసవిస బైటికి వెళ్లిపోయాడు శ్రీధర్.

'రామ్మా... రా... అల్లుడుగారు రాలేదా?' చెప్పా పెట్టకుండా వంటరిగా వచ్చిన లతని పలకరిస్తూ అడిగాడు తండ్రి పరంధామయ్య.

'లేదు నాన్నా... ఆయినకి శలవు దొరక లేదు. పెళ్లికి రెండుమూడు రోజుల ముందుగానే వస్తారు' ముక్తసరిగా సమాధానమిచ్చింది లత.

'పోనీలేమ్మా... నిన్నైనా ముందుగా పంపిం చాడు అదేచాలు' కూతుర్ని పలకరిస్తూ అంది తల్లి కస్తూరి. అక్కని ప్రేమగా కౌగిలించుకొంది చెల్లెలు వసుధ. అక్కాచెల్లిలిద్దరూ తల్లి భోజనా నికి లేవమనేవరకు కబుర్లతోనే గడిపారు. భోజనం చేస్తోందన్న మాటేగాని లతకి ఏమీ సహించడంలేదు. ఆ విషయాన్ని ఆమె తల్లి తండ్రులు పసిగట్టారని ఆమెకు తెలియదు.

పెళ్లి శుభలేఖలు ఎవరెవరికి పంపాలో తండ్రి ఎడ్రస్‌లు చెబుతుంటే రాస్తున్న లతతో 'మొత్తానికి లత రాకతో మీ యింట్లో పెళ్లికళ ఓ రెండు రోజులు ముందుగానే వచ్చిందిరా' ఆమె అత్త అప్పడాలు చేస్తూ తమ్ముడు పరంధా మయ్యతో హాస్యమాడింది.

'నేనోస్తే పెళ్లికళ వచ్చిందనుకొంటున్న వీళ్లు. తీరా నేను ఆయనతో దెబ్బలాడి వచ్చేసా నని తెలిస్తే ఏమనుకొంటారో' లత మనసులో బాధగా అనుకొంది.

రాత్రి భోజనాలయిన తరువాత చల్లగాలిలో తిరగడానికి డాబా మీదకి వెళ్లిన లత, ఆమె తల్లీ తండ్రి ఏదో విషయమై చర్చించుకుంటుంటే ఆసక్తిగా వారి మాటలు వింది.

'చూడు కస్తూరీ, ఇదే మనింట్లో జరుగు తున్న ఆఖరి శుభకార్యం. అందుచేత నువ్వు నామాట విని, అమ్మాయి పెళ్లికి ఓ మంచి పట్టుచీర కొనుక్కో' ఎంతో ప్రేమగా అన్నాడు పరంధామయ్య.

'అహా... నాన్న ఎంత మంచివాడు. అమ్మని పట్టుచీర కొనుక్కోమని ఎంత ప్రేమగా చెబుతు న్నాడు. తన భర్తా ఉన్నాడు ఎందుకు? పట్టుచీర కొనుక్కుంటాను అంటే వద్దంటాడు' తనలో తానే అనుకొంది లత.

అంతలో అమ్మ గొంతు వినిపించడంతో తిరిగి వారి మాటలు వినసాగింది.

'ఏవండి... నాకిప్పుడు ఏ చీరలూ వద్దండి. ఇప్పటికే ఈ పెళ్లికని చాలా అప్పు చేసారు. ఇప్పుడు నేను పట్టుచీర కట్టుకోకపోతే వచ్చే నష్టం ఏమీ లేదు. అయినా ఆడపిల్ల పెళ్లిలో పట్టుచీర కట్టుకోనే తీరకెక్కడ ఉంటుందండి, మీ చోద్యం కాకపోతేను. ఆ డబ్బులు పెట్టి పిల్లలిద్దరికి మంచి చీరలు కొనండి చాలు' అతనితో చెప్పింది కస్తూరి.

ఛ... అమ్మేవిటి పిచ్చిదానిలా పట్టుచీర వద్దంటుంది. అమ్మకసలు బుద్ధిలేదు. హాయిగా నాన్న కొనుక్కోమన్నప్పుడు కొనుక్కోవచ్చుగా. అమ్మ కూడా శ్రీధర్‌లాగే ఆలోచిస్తోంది. ఏమిటో అమ్మా, శ్రీధర్‌ల మనస్తత్వాలు... ఆలోచిస్తున్న లతకి తండ్రి నోటివెంట తన భర్త శ్రీధర్ ప్రస్తా వన రావడంతో మరలా వారి మాటలు ఆసక్తిగా వింది.

'చూసావా కస్తూరి... అల్లుడుగారు ఎంత మంచివారో. పెళ్లికయ్యే ఖర్చులు మీరు పెట్టు కోండి, కట్నం డబ్బులు నేను చూసుకొంటాను

మామగారూ అన్నాడు. నిజంగా అతను మన పాలిటి దేవుడు. అతనే కనక ఇలా కట్నం డబ్బులు సర్దుబాటు చెయ్యకపోతే, మనం ఇంత మంచి సంబంధం తేగలిగేవాళ్లమా?' అల్లుడి గొప్పదనం, ఔదార్యం గురించి మరొక్కసారి మెచ్చుకోలుగా అన్నాడు.

'నిజమేనండి, మన అల్లుడంత మంచి వాళ్లు బహు అరుదుగా ఉంటారండి. కానీ మనమ్మాయే అతని మంచితనాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, ఓ చిన్న పట్టుచీర కోసం అతనితో దెబ్బలాడి ఇక్కడికి వచ్చేసింది. ఆ విషయం మనకి తెలియదనుకొంది పిచ్చిపిల్ల. అయినా అల్లుడు దానిని అర్థంచేసుకొన్నాడు కనకనే ఏమీ గొడవ చెయ్యకుండా, పెళ్లిపనులు నిమిత్తం ఎల్లుండి ఉదయమే వస్తున్నాడు' అంది కస్తూరి.

'ఏమిటి... ఆయన వస్తున్నారా? తన చెల్లెలి పెళ్లినిమిత్తం కట్నం డబ్బులు ఆయన సర్దుబాటు చేస్తున్నారా? అయితే ఆయన ఈ విషయం నా దగ్గర ఎందుకు దాచినట్లు? ' తనలో తానే ప్రశ్నించుకొంది లత.

ఆమె మనసులోని ప్రశ్నను విన్నట్లుగా ఆమె తండ్రి కస్తూరితో 'శ్రీధర్ తాను కట్నం సర్దుతున్న విషయం నలుగురికీ తెలియడం తనకిష్టం లేదని, అందుచేత ఎవరితోనూ చెప్పొద్దన్నాడు.. బహుశా అతను ఈ విషయం మన లతకి కూడా చెప్పినట్లు లేదు. అందుకే పిచ్చిపిల్ల అతణ్ణి అర్థం చేసుకోలేకపోయింది' తుండుతో కళ్లజోడు అద్దాన్ని తుడుచుకుంటూ అన్నాడు పరంధామయ్య.

ఆమె ప్రశ్నకి తండ్రి మాటల్లోనే సమాధానం దొరకడంతో. 'ఛ... తానెంత మూర్ఖురాలు... ఆయన్ని పూర్తిగా అర్థంచేసుకోకుండా, సూటీ పోటీ మాటలతో ఆయన మనసుని ఎంతగా గాయపర్చిందో కదా! కాని ఆయన మాత్రం తనని మన్నించి అమ్మానాన్నల దృష్టిలో ఉన్నతులుగా ఎంతో ఎత్తుకి ఎదిగిపోయారు' తప్పు తెలుసుకొన్న లత పశ్చాత్తాపంగా అనుకొంది.

అల్లుడు శ్రీధర్‌ని అప్యాయంగా ఆహ్వానించారు పరంధామయ్య దంపతులు.

ఏంటి మావయ్యా కులాసానా? పలకరించిన శ్రీధర్ కళ్లు లత కోసం ఆతృతగా వెతుకుతున్నాయి.

అది గ్రహించిన మరదలు వసుధ, 'ఏంటి బావా! ఎవరికోసం వెదుకుతున్నావు? అక్క కోసమా? అక్క ఆ గదిలో నీకోసం వెయిట్ చేస్తోంది' కొంటెగా నవ్వుతూ అంది.

'ఏంటి మరదలా! బావతోనే వేళాకోళమా, ఉండు ముందు మీ అక్కని కలవనీ... తరువాత నీ పని చెప్తాను' అంటూ లత ఉన్న గదివైపు నడిచాడు శ్రీధర్.

లత మనసు ఎంతో ఉద్వేగంతో ఉంది. శ్రీధర్ లోపలికి రాగానే 'ఏవండి.... నన్ను... క్షమించండి, మీ మనసు తెలుసుకోలేక, ఏదో తెలియని కోపంలో మీపట్ల అజ్ఞానిలా ప్రవర్తించాను' అంటూ కన్నీళ్లతో అతణ్ణి చుట్టేసింది.

'ఛ... ఊరుకో లతా... ఏమిటి మరీ చిన్నపిల్లలా అలా ఏడుస్తున్నావు. ఒక భర్తగా నీ మనసు, నీ యిష్టాయిష్టాలూ తెలుసుకోలేకపోయినందుకు నేనే సిగ్గుపడుతున్నాను. నువ్వేమంత తీర్చలేని కోరిక కోరేవని. అనవసరంగా ఓ పట్టుచీర కోసం నీ మనసుని ఎంతో నొప్పించాను' అంటూ బ్యాగ్‌లోనుంచి ఆమెకు అతి యిష్టమయిన వంగపండు రంగు 'పట్టుచీర'ని తీసి ఆమె చేతుల్లో పెడుతూ ఆమెను ప్రేమగా దగ్గరకి తీసుకొన్నాడు శ్రీధర్. ●